వీడీసీ అరాచకాలను ప్రభుత్వం అరికట్టాలి

గౌడ ఐక్య సాధన సమితి డిమాండ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నిజామాబాద్ జిల్లా తళ్లా రామ్‌పూర్‌లో గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) అరాచకాలను ప్రభుత్వం అరికట్టాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబల నారాయణగౌడ్, ప్రధానకార్యదర్శి పొన్నం నారాయణగౌడ్ డిమాండ్ చేశారు. గ్రామ అభివృద్ధి కమిటీకి అడిగినన్ని డబ్బులు ఇవ్వనందుకు గ్రామ బహిష్కరణ చేయటం సరైనది కాదన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీరామ నవమి సందర్భంగా తాళ్ల రామ్‌పూర్‌లో గౌడ కులానికి చెందిన మహిళను బహిష్కరించడం దారుణమని అన్నారు. దీనిని అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని కోరారు. మధ్యయుగం నాటి సంప్రదాయాలను నేటికి గ్రామాలలో అమలు చేయటం దుర్మార్గమైన చర్య పేర్కొన్నారు. కల్లుగీత దుకాణాలను నిర్వహించే గౌడల ఆర్థిక మూలాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


జనహిత సేవా ట్రస్ట్ కరపత్రాన్ని విడుదల చేస్తున్న బీజేపీ నాయకుడు వెంకటేష్

కవాడిగూడ: జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ శిబిరం కరపత్రాలను సోమవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు జి.వెంకటేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముషీరాబాద్ చౌరస్తా సమీపంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఏసీ, రీఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్, ఎయిర్‌కూలర్, గీజర్, రిపేరింగ్‌లో ఉచితంగా రోజుకు 2గంటల చొప్పున 30 రోజుల పాటు శిక్షణ ఇస్తారన్నారు. పరీక్షలు రాసిన 18 ఏళ్ల విద్యార్థులు సెలవు దినాలలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పరిమల్‌కుమార్, శంకర్, సందీప్, శివరాజ్, ట్రస్ట్ ప్రతినిధులు ఎం.శ్రీనివాస్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కారు వెనుక డోర్ తీయడంతో ఇద్దరికి గాయాలు

కాచిగూడ: ఓ మహిళ నిర్లక్ష్యంగా కారు వెనుక డోర్ తీయడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు కిందపడి గాయాల పాలయ్యారు. కాచిగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అంబర్‌పేట శివరోడ్డు ప్రాంతానికి చెందిన అంబికా (27) ఇంటికి వెళ్లడానికి సోమవారం సాయంత్రం రాపిడోలో ద్విచక్రవాహనం బుక్ చేసుకుని ఇంటికి వెళ్తోంది. బర్కత్‌పుర చమన్ సమీపంలో సోనిక (కారు నంబర్ టీఎస్08జేకే1535) వెనుక డోర్ తీసింది. అదే సమయంలో అటు వైపు వస్తున్న ద్విచక్రవాహనం కారు వెనుక డోర్ తగిలి కిందపడిపోయింది. దీంతో అంబిక తలకు గాయం అయ్యింది. రాపిడో డ్రైవర్ సాయికుమార్‌కు ఎడమ చేయి, ఎడమ కాలికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సాయికుమార్ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీబీఎస్ఎస్ కార్యవర్గ సభ్యుడు కస్పా శ్రీకాంత్ మృతి


కస్పా శ్రీకాంత్ (ఫైల్)

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు కస్పా శ్రీకాంత్(48) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, ఉపాధ్యక్షులు రంగారావు, కాణాల శ్యామసుందరరావు, కోశాధికారి మంత్రి సునీల్‌కుమార్ తదితరులు శ్రీకాంత్ పార్థీవదేహానికి వద్ద నివాళులర్పించారు. అలాగే మృతుడి కుటుంబీకులను ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

బైక్ చోరీకి పాల్పడుతున్న వ్యక్తి రిమాండ్

అంబర్‌పేట: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన సోమవారం అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ మల్లీశ్వరీ తెలిపిన వివరాల ప్రకారం... బాగ్‌అంబర్‌పేట సీతఃకాలనీలో ఈనెల 1న సాయిరాం గౌడ్ తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లాడు. ఉదయం లేచి చూసేసరికి ఇంటి ముందు ఉన్న వాహనం కనపడటం లేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని సీసీటీవీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. అల్మాస్‌గూడకు చెందిన వడ్ల శ్రీనివాస్ ద్విచక్ర వాహనాన్ని దొంగలించినట్లు గుర్తించారు. అతడిని తన ఇంట్లో సోమవారం అరెస్టు చేశారు. అతడి వద్ద రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.


పోలీసుల అదుపులో నిందితుడు వడ్ల శ్రీనివాస్

జర పట్టించుకోండి.!

• అధ్వానంగా ఇందిరా పార్కు నిర్వహణ • విరిగిపోయిన ఆట పరికరాలు • పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు




పార్కులో అధ్వాన స్థితిలో టాయిలెట్

కవాడిగూడ: పార్కులు పచ్చదనం, ప్రశాంతత, ఆహ్లాదకరమైన వాతావరణానికి చిరునామాలు. కాని నగరంలో అతిపెద్ద పార్కులలో ఒకటైన ఇందిరా పార్కులో ఆహ్లాదం కరువైంది. పార్కులకు వెళ్లి ఆడుకుందామని వచ్చే పిల్లలకు విరిగిపోయి ఆట పరికరాలు కరువయ్యాయి. నగరంలో పార్కుల అభివృద్ధి కోసం ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని అధికారులు చెప్పినప్పటికీ అలాంటి పరిస్థితులు ఇందిరా పార్కులో కనిపించడంలేదు.

◆ ఇందిరా పార్కుకు నిత్యం వేలాది మంది సందర్శకులతో కిటకిటలాడే ఇందిరాపార్కులో విరిగిపోయిన ఆట పరికరాలు, చెత్తకుప్పలు కనిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు పార్కుల వైపు కన్నెత్తి చూడటం లేదని సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులకు నోచుకోని ఆట పరికరాలు..

◆ ధర్నాచౌక్‌లోని ఇందిరా పార్కు 69 ఎకరాలలో విస్తరించి ఉంది. ప్రతిరోజు దాదాపు 300 - 400మంది, సెలవు దినాలలో 2,500 నుంచి 3,000 సందర్శకులు వస్తుంటారు. ఉదయం దాదాపు 1000 మంది వాకింగ్ చేస్తుంటారు. పెద్దలకు రూ.10, చిన్నారులకు రూ.2 టికెట్ వసూలు చేస్తున్నారు. టికెట్లపై వచ్చే డబ్బులో కొంత ఆట పరికరాల మరమ్మతులకు ఉపయోగించాలని సందర్శకులు కోరుతున్నారు.


విరిగిపోయిన ఆట పరికరాలు వస్తువులు

అపరిశుభ్రంగా మరుగుదొడ్లు...

◆ పార్కులో మరుగుదొడ్లకు తలుపులు ఊడిపోయాయి. కొన్నింటికి నీటి సౌకర్యం లేకపోవడంతో అపరిశుభ్రంగా మారాయి. ఇటీవల కురిసిన భారీ వర్షానికి వాకింగ్‌ట్రాక్ చిత్తడిగా మారింది. దీంతో వాకర్స్, సందర్శకులకు ఇబ్బంది తప్పడం లేదు.



బాధాకరం..

నగరంలో ఇందిరా పార్కుకు ప్రత్యేక స్థానం ఉంది. అలాంటి పార్కులో కనీస సౌకర్యాలు లేకపోవడం బాధాకరం. చిన్నారుల ఆట పరికరాలు విరిగిపోయి ఉన్నాయి. వీటికి వెంటనే మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలి. సంబంధిత అధికారులు పార్కు నిర్వహణ సరిగా జరిగేలా చర్యలు చేపట్టాలి.

– కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ

'ఆరోగ్యమే అసలైన సంపద'


అవగాహన సదస్సులో దుండ్ర కుమారస్వామి, సంస్థ ప్రతినిధులు

కాచిగూడ: ఆరోగ్య సంరక్షణకు ప్రజలు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బ్లిస్‌బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హోప్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కాచిగూడలో 'అందరికీ మంచి ఆరోగ్యం–2025'పేరుతో అవగాహన సదస్సును నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వినయ్ సరికొండతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడం, మంచి ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడం, పరిశుభ్రతను పెంపొందించడం వంటి కీలక అంశాలతో సమాజంలో చైతన్యం తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. 'ఆరోగ్యమే అసలైన సంపద'అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం మనలో కొత్త ఉత్సాహాన్ని నింపి, ఆరోగ్యవంతమైన భవిష్యత్ కోసం కృషి చేసేలా ప్రేరేపించాలని ఆయన ఆకాంక్షించారు.

'ప్రజా వైద్యాన్ని నిర్లక్ష్యం చేయటం సరికాదు'



బాగ్‌లింగంపల్లిలో వైద్యులు నాగులు, రాజును సన్మానిస్తున్న వీరయ్య తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఇది సరైనది కాదని హైదరాబాద్ సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం, హైదరాబాద్ జిందాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధులు అదుపులో ఉండటానికి ప్రజల జీవనశైలిలో మార్పులు రావాలన్నారు. అయితే ప్రభుత్వాలు బడ్జెట్‌లో వైద్యానికి సరైన నిధులు కేటాయించకపోడం బాధాకరమని అన్నారు. పేదలు కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించడంతో వారి ఆర్థిక పరిస్థితి క్షీణిస్తోందని అన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే 102 సెంటర్లలో అనేక ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వైద్యులు నాగులు, రాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌మోహన్ నాయుడు, శ్రీనివాస్‌రావు, ఎం.శ్రీనివాస్, సంగీత, అస్మిత, నాగేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం

శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం సోమవారం ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ వ్యాప్తంగా కనులపండువగా జరిగింది. ఆలయాలు, కాలనీలలో జరిగిన పట్టాభిషేక మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఈ వేడుకకు హాజరై పట్టాభిషేక మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– చిక్కడపల్లి/కాచిగూడ


మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహంలో..


వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో...

బాధ్యతల స్వీకరణ

యాకుత్‌పురా: ఇటీవల జరిగిన ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.పురానీహవేలీలోని కోర్టు బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా పి.నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎ.ఎస్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బి.అజయ్, సంయుక్త కార్యదర్శిగా ఎ.రాజిరెడ్డి, కోశాధికారిగా వి.నిర్మల, లైబ్రరి కార్యదర్శిగా రాకేష్ కులకర్ణి, క్రీడా, సంస్కృతిక కార్యదర్శిగా మహ్మద్ అఫ్జల్ పాషా, మహిళా ప్రతినిధిగా రేణుక, కార్యవర్గ సభ్యులుగా ప్రణతి లక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, వినయ్‌శంకర్, భానుచందర్, సందీప్‌సింగ్, రాజశేఖర్‌యాదవ్, స్మామాట్ కెన్నెట్ పాల్ బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా బీజేపీ వ్యవస్థాపక దినోత్సవాలు




గాంధీనగర్, గగన్‌మహల్‌లలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్లు పావని, రచనశ్రీ

చిక్కడపల్లి: భారత ప్రధాని నరేంద్రమోదీ అన్ని వర్గాల సంక్షేమానికి సంక్షేమానికి కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బీజేపీ వ్యవస్థాపక దినోత్సవాల్లో భాగంగా సోమవారం గాంధీనగర్ డివిజన్‌లోని కెనరా బ్యాంక్ సమీపంలో పార్టీ జెండాను కార్పొరేటర్ పావనితో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్, నేతలు పూసరాజు, వినయ్‌కుమార్, రమేష్‌రామ్, నవీన్‌కుమార్, బూత్ అధ్యక్షుడు బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కవాడిగూడ డివిజన్‌లో...

కవాడిగూడ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడానిక దోహదపడతాయని ఎంపీ డా. కె.లక్ష్మణ్ అన్నారు. సోమవారం కవాడిగూడ డివిజన్ బూత్ నం.50 వద్ద బీజేపీ జెండాను కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, నాయకులు ప్రభాకర్ గంగపుత్ర, సరిత, వీరు, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవికిషోర్

సాక్షి, సిటీబ్యూరో: నాంపల్లిలోని మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది కె. రవికిషోర్ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలియజేశారు. 33 ఏళ్లకు పైగా న్యాయవాద వృత్తిలో రాణిస్తున్న రవికిశోర్ నాయకత్వం, సహచరుల్లో మరింతగా వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు విలువలను బలోపేతం చేసేందుకు ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

హెచ్‌సీయూ విద్యార్థినికి 'బెస్ట్ రిప్లై అవార్డు'

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పోస్టుగాడ్యుయేషన్ విద్యార్థిని లాస్యప్రియ ఉత్తమ ప్రత్యుత్తర అవార్డు (బెస్ట్ రిప్లై అవార్డు) అందుకుంది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లోని పొలిటికల్ సైన్స్ విభాగంలో లాస్యప్రియ ఐఎంఏ చదువుతోంది. ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన నేషనల్ యూత్ పార్లమెంట్–2025లో ఈ అవార్డు అందుకుంది.జిల్లా స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు జరిగిన అన్ని స్థాయిలలో ప్రతిభ చాటింది. ఆమెను పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు అభినందించారు.

ఆర్థిక సాయం

నాంపల్లి: తండ్రిని కోల్పోయిన విద్యార్థులకు ఆర్‌జే ఇన్‌స్పిరేషన్ హ్యాండ్స్, రాధే గ్రూపు సంస్థల సంయుక్త నిర్వాహణలో ఆర్థిక సహాయం చేశారు. సోమవారం రాత్రి నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి హాజరై విద్యార్థులకు చెక్కులను అందజేశారు.

పురస్కారాల ప్రదానం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలను సోమవారం రవీంద్రభారతిలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సామాజిక సేవా సాహిత్య రంగాలు ఒకదానికొకటి అనుసంధానం కలిగి ఉంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో నడవాలని సూచించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి పురస్కారాలను అందజేశారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎస్.బాలాచారి, గాయకులు దరువు అంజన్న, సినీగేయ రచయిత అభియన శ్రీనివాస్, అనుముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ బిల్లుకు బీజేపీ మద్దతు ఇవ్వాలి


నింబోలిఅడ్డలో చేపట్టిన నిరసనలో రాజేందర్ పటేల్‌గౌడ్

కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు బీజేపీ మద్దతు ఇవ్వాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం నింబోలిఅడ్డలో బీసీ బిల్లులకు కేంద్రంలో బీజేపీ మద్దతు ఇవ్వాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో పాస్ చేసిన రెండు బిల్లులకు రాష్ట్రంలో మద్దతునిచ్చిన బీజేపీ.. కేంద్రంలో ఎందుకు వ్యతిరేకిస్తోందని ఆయన ప్రశ్నించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. దేశంలో 70 కోట్ల మంది బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు పులిజాల కృష్ణ, డాక్టర్ ప్రశాంత్ నీమ్‌కర్, రాజేష్ జైస్వాల్, భూషణ్ భాస్కర్, సీహెచ్ ప్రదీప్‌గౌడ్, సత్యప్రకాష్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తా


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: ప్రభుత్వం సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా తన వంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సోమవారం గోల్నాకలోని తన క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద 35 మంది లబ్ధిదారులకు రూ.12.75లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో పేదలకు ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతంగా చేయూతను ఇచ్చేందుకు ఎప్పుడూ ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి


టీపీసీసీ అధ్యక్షుడికి వినతి పత్రం అందజేస్తున్న గుజ్జ కృష్ణ

కాచిగూడ: బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ అసెంబ్లీలో పాస్ చేసిన రెండు బీసీ బిల్లులకు పార్లమెంట్‌లో ఆమోదం పొందే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. బీసీ బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘంజాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ప్రధాన కార్యదర్శి కోల జనార్ధన్ సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి. నందగోపాల్, మట్ట జయంతి, ఉదయ్ నేత తదితరులు పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



కాచిగూడ: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుద్ధ దశమి సందర్భంగా సోమవారం కాచిగూడ వైశ్య హాస్టల్ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొత్తూరు జయప్రకాష్ రామ్, కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైశ్య హాస్టల్ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్ తదితరులు నూతన చైర్మన్ జయప్రకాష్ రామ్, కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

తవ్వి వదిలేస్తే ఎట్లా.?

• మ్యాన్‌హోల్ పక్కనే గుంత.. అధికారులకు లేదు చింత.!


పాత నల్లకుంటలో ఓ ఇంటి ఎదురుగా మ్యాన్‌హోల్ పక్కనే ఏర్పడిన గుంత

నల్లకుంట: పాత నల్లకుంట పాత రామాలయం సమీపంలోని క్షత్రియ టవర్స్ లేన్‌లో ఇటీవల వర్షపు నీటి కాలువ(కల్వర్టు) కూరుకుపోయింది. దీంతో ఏ చిన్నపాటి వర్షం కురిసినా వరద నీరు సాఫీగా వెళ్లడం లేదు. దీంతో ముంపు సమస్యలు తలెత్తుతున్నాయి. సమస్య పరిష్కరించాలని పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధికి, జలమండలి అధికారులకు స్థానికులు విన్నవించారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు మట్టితో కూరుకుపోయిన నాలాకు గత నెలలో మరమ్మతులకు శ్రీకారం చుట్టారు.

మరమ్మతులను మధ్యలోనే ..

◆ ఈ క్రమంలో నాలాకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టకుండా మధ్యలోనే అలాగే వదిలేశారు. దీంతో కల్వర్టు మరమ్మతు కోసం తవ్విపోసిన మట్టి, తొలగించిన పెద్దపెద్ద రాళ్లు వీధిలోనే వదిలేశారు. పనులు నిలిచిపోవడం, మట్టి రోడ్డుపైకి వస్తుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నాలా మరమ్మతు పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు.

మ్యాన్‌హోల్ పక్కనే ఏర్పడిన గుంత..

◆ తూర్పు వైపు ప్రధాన గేటు ఎదురుగా ఉన్న వర్షపు నీటి కాలువపై ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్ పక్కనే కుంగిపోయి ఓ గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా అక్కడ ప్రమాద సూచికగా స్థానికులు ఓ పెద్ద రాయిని ఏర్పాటు చేశారు. ఈ వీధి గుండా రాకపోకలు సాగించే చిన్నారులు ప్రమాదవశాత్తు ఆ గోతిలో పడి గాయపడితే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. ఈ గుంతను ఇలాగే వదిలేస్తే మరింత కుంగిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తవ్వి వదిలేసిన కల్వర్టుతో పాటు వర్షపు నీటి కాలువపై ఉన్న మ్యాన్‌హోల్ పక్కన ఏర్పడిన గుంతకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


పాత రామాలయం ఎదురు వీధిలో తవ్వి వదిలేసిన కల్వర్టు


మ్యాన్‌హోల్ పక్కన ఏర్పడిన గుంత పక్క నుంచే వెళ్తున్న చిన్నారులు